## ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జూలై 7 : సుదీర్ఘకాలంగా మావల గ్రామంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి బదిలీలో భాగంగా ఉపాధ్యాయులు రామగిరికుమార్, కుశాల్ జాడేలు వెళ్తున్నారు. వీరిని ఆదివారం మావల మండల కేంద్రంలో మాజీ మంత్రి జోగు రామన్న గ్రామస్తులతో కలిసి ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగ్‌రావు, సీనియర్ నాయకుడు యూనీస్ అక్బనీ, మాజీ జడ్పీటీసీ నల్ల రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ ఉమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అమ్మవారిని దర్శించుకుంటున్న భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్



బాసర, జూలై 7 : బాసర సరస్వతీ అమ్మవారిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీసుధ, నిజామాబాద్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి సునీత, భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# శేష జీవితానికి ఇదేనా భరోసా..




కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు



కేంద్రంలో గర్భిణులు, పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న టీచర్ రాధ

- టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఎలా సరిపోతాయి..
- దశాబ్దాలపాటు నెలకు రూ.110, రూ.150 జీతంతో పనిచేసినం..
- ఇప్పుడు రిటైర్మెంట్ పేరిట విధులకు దూరం చేస్తే ఎలా బతకాలి..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్న టీచర్లు, ఆయాలు..
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి..
- జిల్లాలో 50 మంది టీచర్లు, 200 మంది ఆయాలు ఉద్యోగ విరమణ

ఎదులాపురం, జూలై 7 : అంగన్‌వాడీలలో దశాబ్దాలుగా టీచర్లు, ఆయాలుగా చాలా మంది పనిచేస్తున్నారు. తొలినాళ్లలో నెలకు రూ.110, రూ.150 వేతనంతో పనిచేశారు. ప్రస్తుతం టీచర్లు రూ.13,650.. ఆయాలు రూ.7,800 వేతనం పొందుతున్నారు. ఇన్నాళ్లు శక్తి ఉన్నంత వరకు పనిచేసి వలంటరీ రిటైర్మెంట్ తీసుకునే వారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ విరమణను తప్పనిసరి చేసింది. ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్లు పూర్తి చేసుకున్న టీచర్లు, ఆయాలు తప్పకుండా ఉద్యోగ విరమణ తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ఆదిలాబాద్ జిల్లాలో 65 ఏళ్ల వయసు దాటిన 50 మంది టీచర్లు, 200 మంది ఆయాలు రిటైర్మెంట్ తీసుకున్నారు. వీరికి ఉద్యోగ విరమణ కింద టీచర్లకు రూ.ఒక లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామని సర్కారు ప్రకటించింది. దీనిపై వారు పెదవి విరుస్తున్నారు. అరకొర వేతనాలతో 40 ఏండ్లు పనిచేశామని, ఇప్పుడు ఈ కొద్దిపాటి డబ్బులతో ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగాల నుంచి తొలగించడం మూలంగా రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ సౌకర్యం కల్పించకుండా రిటైర్మెంట్ ఇవ్వడంతో శేష జీవితాన్ని ఎలా గడపాలని ప్రశ్నిస్తున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నారు. ఇందుకోసం ప్రతి రోజు ధర్నా, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

### నివేదికలను ప్రభుత్వానికి పంపించాం..



ఆదిలాబాద్ జిల్లాలో 65 ఏళ్లు దాటిన వారి వివరాలను ప్రభుత్వానికి పంపించాం. 50 మంది టీచర్లు, 200 మంది ఆయాలు రిటైర్మెంట్ అయ్యారు. అలాగే 399 ఆయా పోస్టులు, 50 మంది టీచర్లు పోస్టులు ఖాళీ ఉన్నాయని నివేదించాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు నోటిఫికేషన్ ద్వారా ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం.

- బి.సబిత, జిల్లా సంక్షేమ అధికారి



జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పాఠాలు బోధిస్తూ..

### రూ.110ల జీతంతో చేరిన..



నేను ఉద్యోగంలో చేరినపుడు నా జీతం రూ.110లు. ఏండ్ల సంది పిల్లలు, ప్రజలకు సేవ చేస్తున్న. ఏ సర్కారైనా, ఏ కార్యక్రమం తీసుకున్న మమ్మల్ని పని చేయమంటే చేస్తున్నాం. ప్రభుత్వాలు చెప్పిన పని చేసినం. గిప్పుడు గీ కాంగ్రెస్ సర్కారోళ్లు 65 ఏండ్లు దాటినయని ఉద్యోగంల నుంచి తీసేస్త మంటున్నరు. గిప్పుడు నాకు ఏ పని శాతనైతది. నేను ఏం పని చేసుకుని బతుకుత. నాకు గిప్పుడు వచ్చే జీతంల సగం జీతమన్న పింఛన్ కింద ఇయ్యాలి. లేకపోతే నా మనవరాలుకైనా ప్రభుత్వ ఉద్యోగం ఇయ్యాలి.

- కనపర్తి లక్ష్మి, బరంపూర్, తలమడుగు మండలం

### ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్టు ఇయ్యాలి..



42 ఏండ్లుగా అంగన్‌వాడీ కేంద్రంలో నా జీవితం, జీవనం గడిచి పోయింది. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ అయితే అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. సన్మానాలు చేస్తారు. మంచిగా ఇంటికి సాగనంపుతారు. వారు ఏ చీకు చింతా లేకుండా బతుకుతారు. మేము ఏం తక్కువ పని చేసినం. పిల్లలకు దశాబ్దాలుగా సేవ చేస్తున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ డబ్బులు ఇచ్చి ఇంటికి సాగనంపడం సరైనదేనా? ఒక్కసారి ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి. మాపై దయ చూపి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్టుగా అన్ని రకాల బెనిఫిట్స్ కల్పించాలని కోరుతున్నా.

- కే.రాధ, అంగన్‌వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

## హత్య కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

- ముగ్గురు మైనర్లు అరెస్టు
- రెండు మొబైల్స్, ద్విచక్ర వాహనం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, జూలై 7 : బాసరలో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించిన ముగ్గురు మైనర్లను అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన అర్జున్ మహారాష్ట్రలోని ధర్మాబాద్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జూన్ 1వ తేదీన ఉదయం 3-4 గంటల మధ్య ఓ టీ కొట్టులో టీ తాగుతుండగా మొబైల్ ఫోన్ పోయింది. ఇదే సమయంలో బాసర, సగ్రోలి(బిలోలి)కి చెందిన ముగ్గురు మైనర్లు ధర్మాబాద్‌లోని అదే టీ కొట్టు వద్ద ఆగారు. నా ఫోన్ పోయింది, మీ ఫోన్ ఇవ్వండి ఒక కాల్ మాట్లాడుకుంటా అని అర్జున్ మైనర్లలో ఒకరిని అడిగాడు. ఇవ్వగానే మాట్లాడాడు. అర్జున్ వీరు బాసర వెళ్తున్నట్లు గమనించాడు. నేను కూడా వస్తానని వారితో అనగా, వారు నిరాకరించారు. దీంతో అర్జున్ నానా బూతులు తిడుతూ గొడవ పడ్డాడు. దీంతో కోపం పెంచుకున్న మైనర్లు అదే ద్విచక్రవాహనంపై నలుగురు కలిసి వెళ్లారు. వెళ్తుండగా కూడా అర్జున్ బూతులు తిట్టడం ఆపలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మైనర్లు బాసరలోని టవర్ వద్దకు తీసుకెళ్లి కట్టెలతో తలపై బాదారు. మరొకరు బండరాయిలో కొట్టారు. ముండ్ల కంపపై పడేసి మంట పెట్టి అక్కడి నుంచి పారిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా ఈనెల 7న బాసర రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేశారు. వీరిని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు మొబైల్స్, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐ మల్లేశ్, ఎస్సై గణేశ్, ఐటీ కోర్ సిబ్బంది రామకృష్ణ, శ్రీనివాస్, నరేందర్, కిరణ్, రాజేశ్వర్‌లను అభినందించారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ అవినాశ్, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

## వన దేవతలకు పూజలు



ఇంద్రవెల్లి గోండ్‌గూడ గ్రామ శివారులో వనదేవతలకు మొక్కుతున్న ఆదివాసులు

ఇంద్రవెల్లి, జూలై 7 : యేటా ఆదివాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగల్లో వన దేవత(అకాడి) ఒకటి. ఆదివారం మండలంలోని ఇంద్రవెల్లి, గోండ్‌గూడ, ప్రధాన్‌గూడ, పోల్లుగూడ, కేస్లాపూర్ గ్రామాలకు చెందిన ఆదివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం చిన్నాపెద్దా తేడా లేకుండా మొక్కులు చెల్లించు కున్నారు. వనదేవతల ఎదుట వ్యవసాయ పనిముట్లు, అడవి బర్రెల కొమ్ములు, నైవేద్యం పెట్టారు. ముందుగా గ్రామ పొలిమేరల్లోని పోచమ్మ తల్లి వద్ద పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండాలని, అడవి జంతువుల నుంచి పశువులకు కాపాడాలని వేడుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. గ్రామాల్లో కలుపు పనులు, దండారీ నృత్యాలకు శ్రీకారం చుడుతున్నట్లు గిరిజన పెద్దలు తెలిపారు.

### ఇంద్రాదేవి ఆలయంలో ఆషాడ మాసం పూజలు

ఆదివాసుల ఆరాధ్యదైవమైన ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో ఆషాడ మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మెండపల్లి, ధనోరా గ్రామాలకు చెందిన ఆదివాసులు ఇంద్రాదేవి ఆలయంలో పూజలుచేసి తమ మొ క్కులు చెల్లించుకున్నారు. ఇంద్రాదేవి ఆలయానికి తరలివచ్చి నైవేద్యం సమర్పించారు.

## మహాభారతాన్ని గోండిభాషలో రచించడం అభినందనీయం

**కలెక్టర్ రాజర్షి షా**


ఎదులాపురం, జూలై 7 : భాషపై అభిమానంతో తొడసం కైలాస్ మహాభారతాన్ని గోండులకు తెలియాలని గోండి భాషలో రచించడం అభినందనీయమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో 'పండోక్న మహాభారత్ కథ' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ కళాకారిణి మర్సుకోల కళావతి మహాభారతంలో పాండవుల జననం గురించి గోండిభాషలో పాట రూపంలో తెలియజేశారు. ఈ సందర్భంగా భాషాభివృద్ధికి ఆర్థిక సాయం కావాలని రచయిత కైలాస్ కోరాడు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తన వంతు సహకారం అందిస్తామని కలెక్టర్, నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జి.నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, రచయిత మెస్రం మనోహర్, తోడం చందు పాల్గొన్నారు.




గోండిభాషలో రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, మాజీ ఎమ్మెల్యే

## కొనసాగుతున్న కౌన్సెలింగ్

కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు



ఎదులాపురం, జూలై 7 : ఆదిలాబాద్‌లోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో స్లాట్‌బుక్ చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం రెండో రోజు కౌన్సెలింగ్ కొనసాగింది. టీజీఈఏపీసీఈటీ ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ధ్రువపత్రాల పరిశీలనలో 280 అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకోగా 231 మంది హాజరయ్యారని ప్రిన్సిపల్, కో-ఆర్డినేటర్ కె.వీరస్వామి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ రాజన్న, సిస్టం అనలిస్ట్ సుజయ్, అధ్యాపకులు నర్సయ్య, శ్రీనివాస్, ప్రవీణ్, సురేశ్, హేమలత, సుధాకర్, సంజయ్‌సింగ్, సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.

## దొంగ అరెస్టు

ఎదులాపురం, జూలై 7 : ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీనాథ్ జిన్నింగ్ మిల్లులో గత నెలలో వేరుశనగ సంచులు, విద్యుత్ మోటార్ చోరీ అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దొంగ కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలో దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన షేక్ తబ్రేజ్‌ను అదే కాలనీలో అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 5వ తేదీ ముగ్గురు సయ్యద్ జావిద్, సయ్యద్ ఇర్ఫాన్, షేక్ జావిద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. ఆదివారం ఐడీ పార్టీ సమాచారం మేరకు పరారీలో ఉన్న షేక్ తబ్రేజ్‌ను అరెస్టు చేశామన్నారు. ఐటీ పార్టీ పోలీసులు రమేశ్, నరేశ్, క్రాంతి, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

# తెగిన బ్రిడ్జి

- రాకపోకలకు అంతరాయం
- పరిశీలించిన అదనపు ఎస్పీ, డీఎస్పీలు



వర్షానికి కొట్టుకు పోయిన తరోడా తాత్కాలిక బ్రిడ్జి

జైనథ్, జూలై 7 : శనివారం కురిసిన వర్షానికి తరోడా(బీ) తాత్కాలిక బ్రిడ్జి తెగింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో జైనథ్, బేల, మహారాష్ట్రలకు వెళ్లాల్సిన వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకుని ఆదివారం ఉదయాన్నే సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా వాహనాలను నిరాల, లాండసాంగ్వి గుండా పంపించారు. బ్రిడ్జి వద్ద ఎలాంటి వాహనాలు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేవలం ద్విచక్రవాహనాలను మాత్రమే బ్రిడ్జిపై నుంచి వెళ్లడానికి అనుమతించారు.

### ట్రాఫిక్‌కు అంతరాయం కాకుండా చూడాలి..

తరోడా(బీ) తాత్కాలిక వంతెన తెగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కాకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ జీవన్‌రెడ్డికి అదనపు ఎస్పీ సురేందర్‌రావు సూచించారు. ఆదివారం తరోడా తాత్కాలిక బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు బ్రిడ్జిపై నుంచి వెళ్లడానికి అనుమతించకూడదన్నారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్రిడ్జికి రెండు వైపుల పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు.